వసతులేవీ?

సమస్యలకు నిలయంగా 'జీఎంఆర్ కాలనీ'

- తాగునీరు, మురుగు కాల్వలు, విద్యుత్, రోడ్లు కరువు
- అధికారులు తనిఖీ చేసిన తీరని సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు


గడ్డపోతారంలోని జీఎంఆర్ కాలనీ

జిన్నారం (పటాన్‌చెరు): నూతనంగా ఏర్పడిన జీఎంఆర్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. కాలనీలో కనీస వసతులు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. గడ్డపోతారం పట్టణ పరిధిలోని కాజీపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 181లో దాదాపు 1000 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇందులో దాదాపు 3 వేలపైగా జనాభాతో ఉన్నప్పటికీ కనీస వసతులు కల్పించకపోవడంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు.

అరకొర వసతులు..

జీఎంఆర్ కాలనీలో కనీస వసతులు లేక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, రోడ్లు లేకపోవడంతో పాటు అరకొర వసతులతోనే జీవనం కొనసాగిస్తున్నారు. కాలనీలో నిరుపేద కుటుంబాలు ఉన్నాయి. సమీపంలోని పారిశ్రామికవాడల్లో బతుకుదెరువు కోసం ఉపాధిని పొందుతూ స్థానికంగా జీవిస్తున్నారు. అయితే కనీస వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా కాలనీకి వెళ్లేందుకు బీటీరోడ్డు లేకపోవడం మట్టి రోడ్డు బురదమయంగా మారుతుంది.

నేటికీ తీరని సమస్యలు

2008లో జీఎంఆర్ కాలనీ ఏర్పాటైన నేటికీ సమస్యలు తీరడం లేదు. కాలనీలో సరైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో పాటు రవాణా వ్యవస్థ ఇబ్బందికరంగా మారింది. అయితే అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి పర్యటించి కాలనీ సమస్యలను పరిశీలించారు. అనంతరం కాలనీలో అంగన్ వాడీ కేంద్రం, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కలెక్టర్‌కు విన్నవించినా.. ఇప్పటివరకు ఎలాంటి సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికీ కాలనీలో సరైన


రోడ్డు బురదమయం

విద్యుత్ వ్యవస్థ, కార్మికుల కుటుంబాల చిన్నారులకు అంగన్ వాడీ, ప్రాథమిక పాఠశాలలు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కాలనీలో పర్యటించి కనీస వసతులను కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: స్థానిక డివిజన్ పరిధిలో సద్దుల బతుకమ్మ సెప్టెంబర్ 29న, దసరా అక్టోబర్ 2న నిర్వహించుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని కోదండ సీతారామ స్వామి దేవాలయంలో పండుగ తేదీలపై కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన.సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని సాకి చెరువు కట్టపై సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే దసరా సందర్భంగా 2న సాయంత్రం 5 గంటలకు జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధ్వజారోహణ, శమీ చెట్టుకు పూజలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీలు జైపాల్, మాణిక్యం, మాజీ కార్పొరేటర్లు శంకర్, సపానదేవ్, నరసింహచారి, భిక్షపతి, ప్రకాష్‌రావు, పురోహితులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

'పుంజు తోక' పుస్తకావిష్కరణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెల్టూర్ శివారులోని ఓ ఫార్మ్ హౌస్‌లో మాజీ ఐపీఎస్, రచయిత కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రాసిన పుంజు తోక పుస్తకాన్ని శనివారం ఎస్పీ పారితోష్ పంకజ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ అధికారిగానే కాకుండా రచయిత, అధ్యాపకుడిగా సమాజానికి సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కృషి చేసిన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రభుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ అంజయ్య, రుక్మారెడ్డి, హనుమయ్య, ఉస్మానియా నల్గొండ పీజీ సెంటర్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ పారితోష్ పంకజ్

క్లుప్తంగా

సైబర్ మోసాలపై అవగాహన


ఏర్పాటు చేసిన మైక్ సెట్

సంగారెడ్డి క్రైమ్: ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాతో పాటు స్థానిక ఐబీ జంక్షన్ వద్ద రెండు మైక్ సెట్‌లను ఏర్పాటు చేసింది. ఈ మైక్ సెట్‌లను ట్రాఫిక్ సిగ్నల్స్ ఆధారంగా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పడిన వెంటనే సైబర్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


హిందీ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు ప్రభును తోటి ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మోసిన్ మాట్లాడుతూ హిందీ జాతీయ భాష అని, జాతీయ సమైక్యతకు ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహదపడిందన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమాధానాలు ఇస్తున్న డీఎం


నారాయణఖేడ్: ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు డయల్ యువర్ డీఎం కృషి చేస్తుందని డీఎం మల్లేశయ్య తెలిపారు. పట్టణంలోని డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. ప్రతీ రోజూ ఉదయం 8 గంటలకు సదాశివపేట్, కంకోల్, రాయికోడ్‌ల మీదుగా నారాయణఖేడ్‌కు బస్సును నడిపించాలని సంగారెడ్డికి చెందిన వీణ కోరారు. అలాగే దప్పూర్ మీదుగా బీదర్‌కు బస్సు నడిపించాలని ఈశ్వర్.. ఫత్తేపూర్ మీదుగా పిట్లంకు బస్సు సదుపాయం కల్పించాలని స్వామిదాస్.. పాట్‌పల్లి బస్సును సెలవు దినాల్లోనూ కూడా నడిపించాలని ఆ గ్రామస్తులు కోరారు. అదే విధంగా బోరంచ మీదుగా పటాన్‌చెరుకు బస్సును నడపాలని కొంగరి వెంకట్‌రెడ్డి.. రాంరెడ్డిపేట్ నుంచి ఖేడ్‌కు, కడ్పల్ మీదుగా జేబీఎస్‌కు బస్సు సదుపాయం కల్పించాలని కృష్ణ కోరారు.

మెగా రక్తదాన శిబిరం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 16న ఖేడ్‌లో సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆధ్వర్యంలో ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే దివ్యాంగులకు సన్మానం , స్వచ్ఛభారత్ ఆత్మనిర్భరత్, వికసితాభారత్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాజుగౌడ్, శంకర్, రాజశేఖర్, మాణిక్, సుగుణాకర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ యూనియన్ కమిటీ ఎన్నిక


వినోద్‌ను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): పట్టణ కేంద్రంలోని వనదుర్గామాత ఆలయ ప్రాంగణంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్ యూనియన్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ముత్తు, ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్నందున కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు సాయిరం, నవీన్, నాగరాజు, ప్రవీన్, బాలాగౌడ్, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్ల ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడం తగదన్నారు. ప్రభుత్వం అనుచిత నిర్ణయం కారణంగా కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ అంజిరెడ్డితోపాటు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

జహీరాబాద్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 207 కేసులు పరిష్కారమయ్యాయని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితాదేవి తెలిపారు. సీనియర్ కోర్టు విభాగంలో 109 కేసులు పరిష్కారమవ్వగా.. రూ.89,08,130 వసూలయ్యాయని వివరించారు. కాగా, జూనియర్ కోర్టు, ఏడీఎం కోర్టు విభాగంలో 98 కేసులు పరిష్కారమవ్వగా.. రూ.64,500 వసూలైనట్లు తెలిపారు.

323 కేసులు పరిష్కారం

జోగిపేట(అందోల్): స్థానిక సబ్ జూనియర్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో కోర్టు పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఎక్సైజ్ స్టేషన్‌లకు సంబంధించి 323 కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు పీపీ స్వాతి గౌడ్, న్యాయవాదులు నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీకాంత్, నర్సింలు, సీఐ అనిల్, వివిధ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.


జహీరాబాద్ కోర్టు ఆవరణలో కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

నారాయణఖేడ్: కక్షిదారుల పరస్పర అంగీకారంతో పలు కేసుల్లో రాజీమార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో కక్షిదారుల పరస్పర అంగీకారంతో 482 కేసులను పరిష్కరించారు.

కొండముచ్చుల దాడి.. ఇద్దరికి గాయాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో శనివారం కొండముచ్చులు ప్రజలపై దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో కొండముచ్చులు గుంపులుగా తిరుగుతున్నాయని, రోడ్డుపై నుంచి వెళ్లే సమయంలో ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే శరణమ్మ, రాజ్‌కుమార్‌లపై దాడి చేయడంతో గాయాలయ్యాయని తెలిపారు. వెంటనే బాధితులను పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. రాంనగర్ తదితర ప్రాంతాల్లో కొండముచ్చులు గుంపులుగా తిరుగతున్నాయని, తమకు రక్షణ కల్పించాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

సీఐటీయూ నాయకుల పరామర్శ

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి అల్ఫా ఇంజినీరింగ్ పరిశ్రమలో ప్రమాదవశాత్తు కాంట్రాక్టు కార్మికుడు గాయపడ్డాడు. శనివారం కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా కార్మికుడు దీపక్ గాయపడ్డాడు. వెంటనే ఆయనను పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ కార్మికుడిని పరామర్శించారు. కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.


దీపక్‌ను పరామర్శిస్తున్న మహిపాల్

బస్టాండ్ ఆవరణలో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నారాయణఖేడ్: పట్టణంలోని నూతన బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. 'సాక్షి' దినపత్రికలో ఈనెల 11న 'మొక్కుబడిగా ప్రణాళిక' శీర్షికతో మున్సిపాలిటీల దుస్థితిపై వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు చెత్తను తరలించి డోజర్ సహాయంతో మట్టిని చదును చేశారు. అనంతరం పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు వేయడం, బహిరంగ మలవిసర్జనను నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


బస్టాండ్ ఆవరణలో చదును చేసిన మున్సిపల్ సిబ్బంది

బైక్ చోరీ

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట నిలిపిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సిర్గాపూ ర్ మండలం కడ్పల్ పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ శనివారం తెలిపారు. రాపర్తినుంచి నిజాంపేటకు వచ్చి బైకును బ్యాంకు వద్ద పార్కింగ్ చేసిన అనంతరం పనులు ముగించుకొని తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకుండా పోయిందన్నారు. అయితే బైక్ నంబర్ టీఎస్ 15 ఈవై 1064 అని, వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

ముమ్మరంగా సాగుతున్న పాఠశాల పనులు


గోడ నిర్మిస్తున్న కూలీలు

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం విద్యార్థులు ఉండేందుకు రేకుల షెడ్డు చుట్టు ప్రక్కల సిమెంట్ ఇటుకతో కూలీలతో గోడ నిర్మిస్తున్నారు. విద్యార్థులు తాత్కాలికంగా వసతి కల్పించేందుకు సరైన స్థలంతో ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మైనార్టీ నాయకులు మక్సూద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల నిరసన

నారాయణఖేడ్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంలో శనివారం మిషన్ భగీరథ పథకం కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే మండలంలో పనిచేస్తున్న కార్మికులకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ వేర్వేరుగా వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26వేలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అశోక్ మిషన్ భగీరథ కార్మికులు నగేష్, శివరాజ్, అశోక్, కాశీనాథ్, శంకరప్ప, మల్లికార్జున్, మోహన్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

వరద నీటికి ధ్వంసమైన రోడ్డు

జిన్నారం (పటాన్‌చెరు): ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. జిన్నారం నుంచి జంగంపేట వెళ్లే రోడ్డు వరదనీటికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ రోడ్డు వెంట ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఆ రోడ్డు వెంట వాహనదారులు ప్రయాణించే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే రెండు గ్రామాల మధ్యన ఓ బ్రిడ్జి నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.


జిన్నారం-జంగంపేట మధ్య ధ్వంసమైన రోడ్డు

తోటల్లో 'ఉద్యాన' విద్యార్థినులు

జహీరాబాద్: మండలంలోని రంజోల్‌లో సాగులో ఉన్న వాణిజ్య పంటలను రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు పరిశీలించారు. శనివారం గ్రామీణ ఉద్యాన పని అనుభవ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రంజోల్‌లో సాగులో ఉన్న అరటి, అల్లం, బొప్పాయి, జామ, పసుపు తదితర పంటలపై విద్యార్థులకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్ వివిధ పంటల్లో వచ్చే చీడ పీడలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు రైతులతో మాట్లాడి సాగు చేస్తున్న పంటల మెలకువలుతెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థినులు మాయ, నవ్య, హర్షిత, మధులత, భార్గవి, అభినయ, లయ, అన్విత, హనీషా, కీర్తి, అనూష, రైతు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


అరటి పంట సాగు వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థినులు

సంక్షిప్త వార్తలు

◆ **16, 17 తేదీల్లో విశ్వకర్మ జయంత్యుత్సవాలు**

నారాయణఖేడ్: పట్టణంలోని వడ్లగల్లీలోని కాళికా మాత ఆలయంలో ఈ నెల 16, 17 తేదీల్లో బోనాల ఉత్సవాలు, విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వడ్ల బ్రహ్మం తెలిపారు. 16న బోనాలు, 17న కాళికా మాత అమ్మవారికి క్షీరాభిషేకం, విశ్వకర్మ విగ్రహస్థాపన, అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

◆ **గుండెపోటుతో అటెండర్ మృతి**

నారాయణఖేడ్: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న మచ్కూరి మొగులయ్య(56) శనివారం మృతిచెందాడు. మండలంలోని జుజాల్‌పూర్‌లోని అతని స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య తేజమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు సంతాపం ప్రకటించారు.

◆ **డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు**

నారాయణఖేడ్: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదోతరగతి, ఇంటర్మీడియట్, బోనాఫైడ్, కుల, ఆదాయ ధృవపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ మేరకు ఈనెల 15, 16 తేదీల్లో కళాశాలలో దరఖాస్తు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **పటాన్‌చెరు టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 ఏడాదికి మిగిలిన సీట్లకు ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఒరిజినల్ మెమో, ఒరిజినల్ టీసీ, బోనఫైడ్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు తీసుకొని హాజరుకావాలని సూచించారు.

◆ **జహీరాబాద్ టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అస్లం ఫారూఖీ ప్రకటనలో తెలిపారు. దోస్త్ ద్వారా మిగిలిన బీఏ, బీకాం, బీఎస్సీ, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 15, 16 తేదిల్లో సూచించిన రిజర్వేషన్ ఆధారంగా అడ్మిషన్లు ఇస్తామన్నారు. విద్యార్థులు ఒరిజినల్ డాక్యుమెంట్‌లతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

◆ **నాగులకుంటను కాపాడండి**

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ ఈదుల నాగులపల్లిలోని నాగులుకుంటను కాపాడాలని మాజీ నీటి సంఘం చైర్మన్ వడ్డె నరసింహ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని కొంతమంది నాగులుకుంట కబ్జాకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ విషయంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. చెరువులు, కుంటలను కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

◆ **పరామర్శ**



జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తల్లి వజ్రమ్మ ఇటీవల మృతి చెందింది. శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం ప్రతాప్‌రెడ్డి స్వగ్రామమైన దౌలాపూర్‌కు చేరుకుని వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతాప్‌రెడ్డితో పాటు సోదరులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, శ్రీధర్, బాల్‌రాజు పాల్గొన్నారు.

◆ **వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఏఎన్ఎంల పై పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న కోఠిలోని కమిషనరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రహమాన్ పిలుపునిచ్చారు. శనివా రం మండలంలోని ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏఎన్ఎంలపై పని భారం మోపడం సరికాదన్నారు. ఏఎన్ఎంలు రోజుకు 14 గంటల పని చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు స్వరూప, ఉమారాణి, యాద మ్మ, సంగీత, జ్యోతి, శారద, సంపూర్ణ, లత పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జైలుశిక్ష**

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జిల్లా న్యాయస్థానం జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. పట్టణ ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డి పల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 11మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని శనివారం సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా.. జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, మిగతా 10 మందికి రూ.వెయ్యి, చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కార్పొరేటర్ కుమార్‌యాదవ్


కాంట్రాక్టర్‌కు పలు సూచనలు ఇస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ. 49.5 లక్షలతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను డీఈ కృష్ణవేణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, సకాలంలో రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.